# ఎలిమినేడులో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

.భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన మహిళలు.
.డప్పు, డోలు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగింపు.
.శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలతో సందడిగా మారిన గ్రామ వీధులు.



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 6,(జనం వాయిస్ ):**
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉరదేవతలకు శివసత్తుల పూనకాలతో పోతురాజు ఆటలతో విన్యాసాలతో డప్పు వాయిద్యాలతో భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి దీవెనలతో వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి రైతుల ముఖంలో సుఖసంతోషాలు అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, కుల బంధువులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# బీసీ,ఎస్సీ,ఎస్టీల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

... మహబూబాబాద్‌లో జిల్లా బీసీ--ఎస్సీ--ఎస్టీ జేఏసీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**మహబూబాబాద్, సెప్టెంబర్ 6 (జనం వాయిస్):**
రాష్ట్ర బీసీ--ఎస్సీ--ఎస్టీ జేఏసీ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అన్ని కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బండి పుల్లయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా బీసీ--ఎస్సీ--ఎస్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ చందా మల్లయ్య, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ ఇన్‌చార్జి మేకల సుమన్ మహారాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా బీసీ--ఎస్సీ--ఎస్టీ జేఏసీ నూతన హడక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో సుమారు 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే అంతిమ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా, సబ్బండ కులాలకు సమాన వాటా సాధించేందుకు రాష్ట్ర చైర్మన్ డా. విశారధన్ మహారాజ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు అన్ని కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**నూతన కమిటీ ఎన్నిక :**
జిల్లా కన్వీనర్‌గా ముంజాల రాజేందర్ గౌడ్, కో-కన్వీనర్లుగా గండి వీరేందర్ గౌడ్, మంగళంపల్లి హుస్సేన్ మహారాజ్, నేతుల వెంకన్న యాదవ్, విడిగా వెంకన్న ముదిరాజ్, చందా శ్రీనివాస్ మాల, కోట యల్లేష్ ఎరుకల, గండి శారద గౌడ్, గాడిపల్లి రాములు మహారాజ్, పెద్ది వెంకన్న గౌడ్, వరిపల్లి జంపయ్య రజక, బానోత్ బీజియా లంబాడా, కొమ్ము ఎల్లయ్య మహారాజ్, కొడుపుగంటి శ్రీధర్ రజక, దాసరి లక్ష్మీనివాస్ మహారాజ్ తదితరులను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా దుగ్గి గోపాల్ రజక్‌ను నియమించారు. ఈ సమావేశంలో వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

.చింతపట్లకు చెందిన పెడ్యాల మహేష్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం.



**యాచారం, సెప్టెంబర్ 6 (జనం వాయిస్):**
మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పెడ్యాల మహేష్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని శేరిగూడ సమీపంలో ఉన్న శ్రీ ఇందు కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏసీఎల్బీ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఐకెఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

... రైతు--కూలీలకు గుజ్జు దేవేందర్ పిలుపు




**మహబూబాబాద్, సెప్టెంబర్ 6 (జనం వాయిస్):**
మంచిర్యాలలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ పట్టణంలోని బట్టు అంజయ్య స్మారక భవనంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యవసాయ విధానాలను వ్యతిరేకించాలని, ఆదివాసీల చట్టబద్ధ, సాంప్రదాయ హక్కులను పరిరక్షించాలని అన్నారు. 1/70 చట్టాన్ని సవరించి ఆదివాసీలు, గిరిజనులు, ఎస్సీ, బీసీ పేద రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ చట్ట సవరణను ఐక్యంగా ఎదుర్కోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద రైతులకు పిలుపునిచ్చారు. యాప్ ద్వారా యూరియా పంపిణీ చేసే విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్‌ఫోన్లు కొనుగోలు చేయలేకపోవడం, ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యల కారణంగా గిరిజన రైతులు యూరియా పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూరియా కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చి అధిక ధరలు చెల్లించడంతో పాటు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పాలకవర్గాలకు మద్దతు ఇచ్చే సంఘాలు తమ వైఖరిని మార్చుకుని, ప్రజా సమస్యలపై విప్లవ ప్రజా సంఘాలు చేపట్టే పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరారు. గత మూడు సంవత్సరాల ఉద్యమాన్ని సమీక్షించడంతో పాటు రైతాంగం, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభలకు రైతులు, కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎస్కె బాబు, మండల నాయకులు తెలబోయిన కృష్ణ, అల్లి ఏకాంబరం, మల్లయ్య, కళ్యాణ్, భరత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# వీరాస్వామి తల్లి మృతికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నివాళి

... పూలమాల వేసి నివాళులర్పించిన సమ్మిగౌడ్.. కుటుంబ సభ్యులకు పరామర్శ



**మహబూబాబాద్, సెప్టెంబర్ 6 (జనం వాయిస్) :**
కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తిరుగుడు వీరాస్వామి తల్లి బక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందడం తీవ్ర విచారకరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బక్కమ్మ మృతి విషయం నాయకులు, వార్డు సభ్యుల ద్వారా తెలుసుకున్న సమ్మిగౌడ్ ఆదివారం ఉప్పరపల్లిలోని ఆమె నివాసానికి చేరుకున్నారు. పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్తకు సుఖదుఃఖాల్లో అండగా ఉంటుందని అన్నారు. గ్రామాల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. పార్టీ శ్రేణులంతా సంఘటితంగా ఉంటూ ఒకరి కష్టాల్లో మరొకరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు దయాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కంచ రాజు, పలస పద్మా వెంకన్న, తండా సంపత్, యువజన నాయకులు తండా శ్రీనివాస్, అరిగే విజేందర్, పబ్బతి సారంగం, అడప రమేష్, ఏటురోజు పరిపూర్ణచారి, పబ్బతి శ్రీనివాస్, పలస నాగేష్, బట్టు మురళి, కంకల కొమురయ్య, ఆవుల బాబు, కంచ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా దేవగిరి సూర్యప్రకాష్




**సెప్టెంబర్ 6 జనం వాయిస్ పాలకుర్తి:**
జనగామ జిల్లా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, వినూత్న బోధనా విధానాలతో విద్యార్థుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటున్న దేవగిరి సూర్యప్రకాష్, సెకండరీ గ్రేడ్ టీచర్, ప్రాథమిక పాఠశాల దర్దేపల్లి ఈ రోజు జనగామ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఘనమైన కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు శ్రీహరి వారి చేతుల మీదుగా సూర్యప్రకాష్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించడం జరిగింది. సూర్యప్రకాష్ కేవలం పాఠ్యపుస్తక బోధనకే పరిమితం కాకుండా, ఆటపాటలు, వినూత్న కార్యక్రమాలు, ఆకర్షణీయమైన బోధనోపకరణాలు మరియు కార్యాచరణ ఆధారిత బోధన ద్వారా విద్యార్థులకు విద్యను మరింత ఆసక్తికరంగా అందిస్తున్నారు. వందల రకాల స్వీయ తయారీ బోధనోపకరణాలను ఉపయోగిస్తూ పిల్లలలో నేర్చుకోవాలనే ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంపొందిస్తూ ఆదర్శవంతమైన బోధనను కొనసాగిస్తున్నారు. వారు ఏ పాఠశాలలో పనిచేసినా తమదైన ప్రత్యేకతను చాటుకోవడం వారి విశిష్ట లక్షణం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సేవ చేయడమే తన పరమావధిగా భావిస్తూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటారు. సమాజాన్ని పాఠశాలకు దగ్గర చేసి, "మన ఊరు -- మన బడి" భావనతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేస్తున్నారు. ఎన్ని అవార్డులు, రివార్డులు, సన్మానాలు అందుకున్నప్పటికీ నిరాడంబరతను వీడకపోవడం సూర్యప్రకాష్ వ్యక్తిత్వానికి నిదర్శనం. విద్యార్థుల అభివృద్ధినే నిజమైన పురస్కారంగా భావిస్తూ, నిరంతరం విద్యారంగ సేవలో ముందుకు సాగుతున్న ఆయనకు ఈ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం దర్దేపల్లి పాఠశాలకు, పాలకుర్తి మండలానికే గర్వకారణం అని తోటి ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు. ఈ సందర్భంగా దేవగిరి సూర్యప్రకాష్ బంధువులు, ఉపాధ్యాయ మిత్రులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు హృదయపూర్వకంగా అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు పాఠాలు మాత్రమే బోధించడు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. ఆ బాటలో అంకితభావంతో సాగుతున్న ఉపాధ్యాయుడే దేవగిరి సూర్యప్రకాష్.

# బక్కం లక్ష్మి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించిన: మంచాల ఎల్లయ్య.



**సెప్టెంబర్ 6 జనం వాయిస్ పాలకుర్తి:**
జనగామ జిల్లా: పాలకుర్తి మండలం బమ్మెర గ్రామం చీ= నగర్ కి చెందిన బక్కం (కంచేలా) కొమురయ్య తల్లి బక్కం లక్ష్మి దశదినకర్మ కు హాజరై వారి మాతృమూర్తికి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించిన, స్టేషన్ ఘన్పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జంపాల రాజు, పెంతల సోమిరెడ్డి, శివరాత్రి సోమయ్య, పెంతల సోమన్న, పెంతల అశోక్, మరియు హనుకొండ ×ణఖీజ బ్యాంకు మేనేజర్ గాజుల రాజేంద్రప్రసాద్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని లక్ష్మి నివాళులు అర్పించారు.

# కురవిలో సర్కారు భూములకు 'కబ్జా' శఠగోపం..!

... 275 ఎకరాల ప్రభుత్వ భూమి మాయం.. 'పెద్దల' చేతుల్లో బందీ!
... ఫిర్యాదులు ఎన్నో.. రెవెన్యూ శాఖ మౌనం ఎందుకో..?
... 43 ఎకరాల 09 గుంటల అబాది భూములపై ఆక్రమణ ఆరోపణలు
... 158 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూములపై కబ్జా ఆరోపణలు
... 11 ఎకరాల 19 గుంటల సీలింగ్ భూములపైనా అక్రమాల కలకలం
... సర్కారు రికార్డుల్లో భూమి.. క్షేత్రస్థాయిలో కనిపించని హద్దులు!
... సర్వే నంబర్ 177, బై నంబర్లపై సమగ్ర సర్వేకు డిమాండ్
... కలెక్టర్, ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా కనిపించని చర్యలు
... సీపీఐ నేతల వినతి.. ప్రభుత్వ భూములకు బోర్డులు ఏర్పాటు చేయాలి
... బోర్డులు పెట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదులు.. అయినా కదలని రెవిన్యూ యంత్రాంగం!



## కురవి ప్రభుత్వ భూములు ఎవరి స్వాధీనంలో..?

... 275 ఎకరాల 22 గుంటలపై స్పష్టతేదీ?
... అబాది భూమి 43 ఎకరాల 09 గుంటలు.
... సర్వే నంబర్ల వారీగా వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్.

**కురవి, సెప్టెంబర్ 5 (జనం వాయిస్) :**
మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల వివరాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రికార్డుల ప్రకారం గ్రామ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు పేర్కొంటుండగా, అందులో అబాది (జనావాస) భూమి 43 ఎకరాల 09 గుంటలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అబాది భూమి ప్రస్తుతం ఎవరి స్వాధీనంలో ఉంది? ఏ మేరకు ప్రభుత్వ ఆధీనంలో ఉంది? ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**సర్వే నంబర్ల వారీగా వివరాలు వెల్లడించాలి**

ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్, ఉప సర్వే నంబర్, విస్తీర్ణం, భూమి స్వభావం, ప్రభుత్వ భూమిగా నమోదైన రికార్డు, ప్రస్తుత వినియోగం, ఆక్రమణ పరిస్థితి తదితర వివరాలను అధికారులు బహిరంగపరచాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా అబాది భూములకు [...] ఉన్న పరిస్థితులు ఒకేలా ఉన్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

**రికార్డులు--క్షేత్రస్థాయి పరిస్థితులపై సమన్వయ పరిశీలన**

భూములపై వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు పహాణీ, అడంగల్, ఆర్ఓఆర్, సెత్వార్, ఎఫ్ఎమ్‌బీ, టిప్పన్, కాసరా పహాణి ప్రభుత్వ భూముల రిజిస్టర్లు వంటి సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించడంతో పాటు, అవసరమైతే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని కోరుతున్నారు. అదేవిధంగా సంబంధిత భూములపై రిజిస్ట్రేషన్ శాఖలో నమోదైన పత్రాలు కూడా పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో వాటిని సరిపోల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ అయిందా? ఏదైనా పట్టా, [...] ఒక విధంగా ఉండి క్షేత్రస్థాయిలో మరో విధంగా ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని కోరుతున్నారు.

**ప్రభుత్వ భూముల రక్షణపై నిబంధనలు అమలు చేయాలి**

ప్రభుత్వ భూములు అనధికారిక ఆక్రమణకు గురికాకుండా సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. తెలంగాణ భూ ఆక్రమణ నిరోధక చట్టం, 1905 ప్రకారం ప్రభుత్వ భూమిపై అనధికారిక ఆక్రమణ ఉంటే సంబంధిత అధికారులకు చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం ఉంది. అలాగే తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం, 2020 పరిధిలో భూముల హక్కులు, రికార్డుల నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

**సమగ్ర సర్వేతో వాస్తవాలు వెలుగులోకి..**

అందువల్ల కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని మొత్తం ప్రభుత్వ భూములను సర్వే నంబర్ల వారీగా గుర్తించి, జీపీఎస్, క్షేత్రస్థాయి సర్వేతో హద్దులు నిర్ధారించి, ప్రతి భూమికి సంబంధించిన ప్రస్తుత స్థితిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ రికార్డులు.., రిజిస్ట్రేషన్ పత్రాలు.., క్షేత్రస్థాయి పరిస్థితులను సమన్వయం చేసి సమగ్ర విచారణ నిర్వహిస్తే ప్రభుత్వ భూములపై నెలకొన్న అనుమానాలకు తెరపడటంతో పాటు, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రభుత్వ భూముల వివరాలను పారదర్శకంగా బహిరంగపరచి, ఆక్రమణలు ఉన్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**కురవి, సెప్టెంబర్ 6 (జనం వాయిస్) :**
మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అక్రమార్కుల పాలువుతున్నాయి. అధికారుల రికార్డుల్లో మాత్రం ఆ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు 'పెద్దల' చట్టవిరుద్ధమైన స్వాధీనంలో ఉంటూ కబ్జాల పర్వం జోరుగా సాగుతోంది. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నా, స్పందించాల్సిన రెవిన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రికార్డుల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా!**
కురవి గ్రామ రెవిన్యూ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో అబాది భూములు 43 ఎకరాల 09 గుంటలు కాగా, మరో 158 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూములతో పాటు 11 ఎకరాల 19 గుంటల సీలింగ్ భూములు ఉన్నాయి. అయితే, ఈ కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులపై కబ్జాదారుల కన్ను పడింది. సర్కారు భూములను తమ సొంత జాగాలాగ మార్చేసుకుంటున్నా నివారించాల్సిన రక్షకులే భక్షకులుగా మారారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కదలని రెవిన్యూ యంత్రాంగం..**
ముఖ్యంగా సర్వే నెంబర్ 177, దాని బై నెంబర్లలో ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, అక్రమార్కుల నుంచి వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, దళిత నాయకులు దైద భద్రయ్య, సీనియర్ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివ రావు, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు ఇరుగు వెంకన్నలు జిల్లా కలెక్టర్‌కు, కురవి ప్రజావాణిలో అధికారికంగా ఫిర్యాదులు చేశారు.

**సమగ్ర సర్వే చేసి బోర్డులు ఏర్పాటు ఏమైంది..?**
మరోవైపు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, కురవి పట్టణ కార్యదర్శి తురక రమేష్ తదితరులు సైతం కురవిలోని ప్రభుత్వ భూములపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి, అవి ప్రభుత్వ భూములని స్పష్టం చేస్తూ అధికారికంగా బోర్డులు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇన్ని పార్టీలు, సంఘాలు ప్రజావాణి వేదికగా మొరపెట్టుకున్నా, రెవిన్యూ అధికారుల్లో మాత్రం నేటికీ చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, కురవి మండల కేంద్రంలోని విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# పార్టీలకతీతంగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపిక : దావేర అనిల్ కుమార్



**సెప్టెంబర్ 6 జనం వాయిస్ పాలకుర్తి:**
దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెరా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దేవరుప్పుల మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి నిన్న జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహించి ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపి పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా నిజమైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవడం పట్ల దేవరుప్పుల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, గత పది సంవత్సరాలుగా డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి పేదలకు ఇళ్లు అందకుండా కాలయాపన చేసిందని, అయితే ప్రస్తుతం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చొరవతో పార్టీలకతీతంగా నిజమైన అర్హులైన పేదలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి డబుల్ బెడ్రూం ఇళ్లను అందించే ప్రక్రియ చేపట్టడం అభినందనీయమని, నిజమైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గారికి దేవరుప్పుల మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు.

PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# రూ.1.50 కోట్ల రోడ్డుకు.. నాణ్యత గాలికేనా?

- ప్రజాధనంతో పనులు..అధికారుల పర్యవేక్షణ ఏదీ?
- నాసిరకం పనులకు కాంట్రాక్టర్‌దే బాధ్యతా?
- పంచాయతీరాజ్ అధికారుల తనిఖీలు ఎక్కడ?



**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 6:**
ఎం.ఆర్.ఆర్. నిధుల కింద రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న శాయంపేట నుండి నాగసముద్రం వయా పత్తిపాక బీటీ రోడ్డు పనుల నాణ్యతపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల కంకర పోసి వదిలేయడం, నాగసముద్రం మత్తడి వెళ్లే ప్రాంతంలో నిర్మించిన లో లెవెల్ వంతెన పనుల నాణ్యతపై అనుమానాలు ఉండటంతో అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాలుగు కల్వర్టుల నిర్మాణంలోనూ నాణ్యతా



ప్రమాణాలు పాటించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

**కంకర పోసి వదిలేశారు..**
శాయంపేట కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయం నుంచి నాగసముద్రం చెరువును ఆనుకుని పత్తిపాక గ్రామంలోని తేల్లామిట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎం.ఆర్.ఆర్. నిధుల కింద రూ.1.50 కోట్లతో అంచనాలు రూపొందించినట్లు తెలిసింది. రైతులకు రాకపోకలు సులభతరం చేయడంతోపాటు వాహనాల రాకపోకలకు అనుకూలంగా రహదారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పనులు చేపట్టారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కంకర పోసి అలాగే వదిలేయడంతో పనుల నాణ్యత, పురోగతిపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కల్వర్టుల నిర్మాణంపై అనుమానాలు..**
రోడ్డు పనుల్లో భాగంగా నాగసముద్రం మత్తడి వెళ్లే ప్రాంతంలో ఒక లో లెవెల్ వంతెనతోపాటు నాలుగు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. లో లెవెల్ వంతెన పనుల నాణ్యతపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాలుగు కల్వర్టుల్లో సిమెంట్, కంకర తగినంతగా వినియోగించలేదని, కొలతలకు



అనుగుణంగా చూపించేందుకు పగిలిన రాళ్లు, ఇటుకలు ఉపయోగించినట్లు రైతులు చెబుతున్నారు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

**అధికారులు అటువైపు చూడరా?**
పనులు జరుగుతున్న ప్రాంతంలో పంచాయతీరాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల ప్రమాణాలు, కల్వర్టులు, లో లెవెల్ వంతెన నిర్మాణాన్ని అధికారులు పరిశీలించాల్సి ఉన్నా.. ఇప్పటివరకు తగిన స్థాయిలో తనిఖీలు కనిపించలేదని స్థానికులు పేర్కొంటున్నారు.
ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి ఇప్పటికే జరిగిన పనుల నాణ్యతను పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు.. నాణ్యతా ప్రమాణాలతో రహదారి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆటో డ్రైవర్గా సత్యవతి.. కాంగ్రెస్‌పై సమరశంఖం..!

... రూ.12 వేల హామీ ఏదీ..? ఆటో డ్రైవర్లకు అన్యాయం ఎందుకు..?
... ఆటో డ్రైవర్ల గోడు పట్టదా..? రేవంత్ సర్కార్‌పై ఫైర్!
... హామీల హంగామా.. అమలులో శూన్యం! కాంగ్రెస్‌పై ధ్వజం
... ఆటో నడిపి నిరసన.. కాంగ్రెస్‌కు సత్యవతి సవాల్
... వెయ్యి రోజులు గడిచినా హామీ అమలు కాలేదని విమర్శ
... ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన
... మాట తప్పితే ప్రజలే తగిన తీర్పు ఇస్తారని హెచ్చరిక
... మిగిలింది 800 రోజులేనంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి
... ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా ఆటో నడిపిన సత్యవతి రాథోడ్

**కురవి, సెప్టెంబర్ 6 (జనం వాయిస్) :**
ఆటో డ్రైవర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కురవి మండలం పెద్దతండాలో ఆటో





డ్రైవర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ దేవత బొడ్రాయికి మొక్కి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న సత్యవతి రాథోడ్.. వారికి మద్దతుగా స్వయంగా ఆటో నడిపి నిరసనలో పాల్గొన్నారు.

**హామీలు అమలు చేయాలి**
ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. నిరసనకు హాజరైన ఆటో కార్మికులకు కిరాయి అందించి ఆమె తన సంఘీభావాన్ని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు.

**ప్రజా కోర్టులో బుద్ధి చెప్పడం ఖాయం**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెయ్యి రోజులు గడిచినా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ఇక మిగిలింది 800 రోజులు మాత్రమేనని, ఈ వ్యవధిలోనైనా హామీలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. హామీల అమలుపై ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, భవిష్యత్తులో ప్రజా కోర్టులో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు బోడ శ్రీనివాస్ నాయక్, నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ కానుక అందించిన మిత్ర బృందం

**జనం వాయిస్.కోహెడ.అక్టోబర్.6:**
తమ తోటి చదువుకున్న చిన్ననాటి క్లాస్మేట్ 1999-2000 పదవ తరగతి రాచకొండ బుచ్చయ్య తన మొదటి కుమార్తె వివాహం ఈరోజు గుగ్గిళ్ళ కళ్యాణ మండపం లో జరిగింది. తన మిత్రులు అందరూ కలిసి 50,116 రూపాయలను తమ గురువు పరకాల ఎల్లయ్య సార్ ద్వారా పెళ్లి పందిరిలో అందించి శభాష్ అనిపించి స్నేహానికి ఉన్న విలువను తెలియజేశారు. స్నేహ కానుక అందించిన మిత్ర బృందం ను పలువురు అభినందించారు



## సీనియర్ జర్నలిస్ట్ గోవర్ధన్ కు మాతృవియోగం.

**పరామర్శించిన జిల్లా యూనియన్ అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ గౌడ్.**

**డోర్నకల్/మరిపెడ,సెప్టెంబర్ 06(జనం వాయిస్).**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల సీనియర్ జర్నలిస్ట్,పోతుల గోవర్ధన్ తల్లి పోతుల కాంతమ్మ (84) అనారోగ్య కారణాలతో ఆదివారం మరిపెడలో మరణించారు.విషయం తెలుసుకున్న టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంధసిరి రవి మహబూబాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ లు జర్నలిస్ట్ గోవర్ధన్ ను,పరామర్శించి కాంతమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలుపారు,వారు మాట్లాడుతూ అమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు అన్నారు.వారి వెంట మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మూడు శ్రీ కుమార్,ఉపాధ్యక్షులు బానోత్ ప్రవీణ్ నాయక్,సీనియర్ జర్నలిస్ట్ రేఖ అశోక్,కారంపురి వెంకటేశ్వర్లు,బోడ శ్రీనివాస్,మూడు విజయకుమార్,ఉప్పల రమేష్,తదితరులు పాల్గొన్నారు..




## పోతుల కాంతమ్మ మృతికి ప్రగాఢ సంతాపం.

**సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్.**

**మరిపెడ,సెప్టెంబర్ 06(జనం వాయిస్).**
నవతెలంగాణ సీనియర్ జర్నలిస్టు పోతుల గోవర్ధన్ తల్లి పోతుల కాంతమ్మ ఈరోజు మృతి చెందడం పట్ల సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం.డి.అబ్దుల్ రషీద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పోతుల కాంతమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి,సంతాపం తెలిపారు.ఈ విషాద సమయంలో సీనియర్ జర్నలిస్టు పోతుల గోవర్ధన్ కి,వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమలాకర్ పాల్గొని,పోతుల కాంతమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఎ.డి.అబ్దుల్ రషీద్ సీపీఐ జిల్లా సమితి సభ్యులు..



## కొత్తపల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**.బోనాల ఊరేగింపులో పాల్గొన్న ఎన్ ఎన్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి**

**యాచారం, సెప్టెంబర్ 6 (జనం వాయిస్):**
మండలం లోని కొత్తపల్లి గ్రామంలో శ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఎన్ ఎన్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బోనాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను నెత్తిన పెట్టుకుని అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాయిని నవీన్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బ్రెయిన్ స్ట్రోక్ తో వుర్లుగొండ సురేష్ మృతి.

**పరామర్శించి నివాళులర్పించిన నాయకులు.**
**మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్,మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ నవీన్ రావు.**

**మరిపెడ,సెప్టెంబర్ 06(జనం వాయిస్).**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన వుర్లుగొండ సురేష్ బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా శనివారం ఉదయం అకాల మృతి చెందాడు.విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ నాయకులు మాజీ మంత్రి ధీ ఎస్.రెడ్యానాయక్,మహబూబాబాద్ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.పరామర్శలో సీనియర్ నాయకులు రామడుగు అచ్యుత్ రావు,కలసాని దామోదర్ రెడ్డి ఎల్లంపేటకు చేరుకుని సురేష్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి,అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.వారి వెంట గండి మహేష్,గండి పరమేష్,తాళ్లపల్లి శ్రీనివాస్,గండి అంబరీష్,గండి పుల్లయ్య,వుర్లుగొండ మధు,గండి ఉపేందర్,వుర్లుగొండ సోమయ్య,వుర్లుగొండ రవి,గండి వెంకటేష్,గండి హరీష్ తదితరులు ఉన్నారు.




## ఘనంగా కిషన్ నాయక్ 50వ జన్మదిన వేడుకలు

**జనం వాయిస్, హుస్నాబాద్ సెప్టెంబర్.6:**
గిరిజన ముద్దుబిడ్డ తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్ 50వ జన్మదిన వేడుకలను హుస్నాబాద్, అక్కన్నపేట గిరిజన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి కిషన్ నాయక్‌కు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కిషన్ నాయక్ కృషి చేస్తున్నారని తెలిపారు. గిరిజనుల అభ్యున్నతికి, పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ఎస్సీ, ఎస్టీలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సర్వన నాయక్ వెంకటయ్య డిక్య నాయక్ గిరిజన సంఘాల నాయకులు రాజు నాయక్ భూక్యా వీరన్న నాయక్ ధరావత్ తిరుపతి నాయక్ భూక్య తిరుపతి నాయక్ భూక్య మోతిలాల్ నాయక్ తిరుపతి నాయక్ తిరుపతి నాయక్ రామచంద్రనాయక్ జరుపుల మోహన్ నాయక్ నెహ్రూ నాయక్ సత్యం నాయక్ శీను నాయక్ లాలూ నాయక్ సోములు నాయక్



## నిరుపేద కుటుంబానికి కానిస్టేబుల్ ఆపన్నహస్తం

**గాయపడిన మజీద్ స్వీపర్‌కు రూ.4 వేల సాయం**



**జనం వాయిస్, హుస్నాబాద్ సెప్టెంబర్ 6:**
ఆ కుటుంబానికి రోజూ పని చేస్తేనే పూట గడుస్తుంది.. సొంత ఇల్లు కూడా లేదు.. ముగ్గురు ఆడపిల్లలు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదవశాత్తు కాలికి తీవ్ర గాయం కావడంతో నెల రోజులుగా పనికి దూరమయ్యాడు. కుటుంబ పోషణ భారంగా మారిన వేళ ఓ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మానవత్వంతో స్పందించి ఆపన్నహస్తం అందించారు. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరికి చెందిన అహ్మద్ షరీఫ్ హుస్నాబాద్ ఆలంగీర్ మజీద్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. నెల రోజుల క్రితం ఇంటి వద్ద కాలుజారి కిందపడటంతో ఎడమ కాలి పాదం కింద నరాలు దెబ్బతిని తీవ్ర గాయమైంది. కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా ఆరు కుట్లు వేశారు. గాయం కారణంగా పనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. ఈ క్రమంలో మల్లెచెట్టు వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హుస్నాబాద్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ అలీ మహమ్మద్‌కు అహ్మద్ షరీఫ్ తన పరిస్థితిని వివరించారు. దీంతో చలించిపోయిన అలీ మహమ్మద్ ఆదివారం అహ్మద్ షరీఫ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకుని రూ.4 వేల ఆర్థిక సాయం అందించారు.అహ్మద్ షరీఫ్ కుటుంబానికి దాతలు తమకు తోచిన సహాయం అందించి అండగా నిలవాలని అలీ మహమ్మద్ కోరారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి పోలీసు సిబ్బంది చూపిన మానవత్వంపై స్థానికులు అభినందనలు తెలిపారు.

## శిక్షణా తరగతులకు హాజరైన సర్పంచులు

**జనం వాయిస్.అక్కన్నపేట సెప్టెంబర్ 6**
తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ భవన్,లో నిర్వహించిన గ్రామ సర్పంచుల శిక్షణా తరగతులకు అక్కన్నపేట మండలానికి చెందిన పలువురు సర్పంచులు ఆదివారం హాజరయ్యారు. శ్రీరామతండా సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బానోత్ వెంకటేష్, గౌరవెల్లి సర్పంచ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాంద్రాల దాము, చౌటకుంట సర్పంచ్ జాన్‌కుమార్, సేవాలాల్ మహారాజ్ తండా సర్పంచ్ సునీత రాజునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచులు తీసుకోవాల్సిన నిర్ణయాలు, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించే విధానాలపై శిక్షణలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కమిషనర్ దివ్యను కలిసి మండలంలోని సర్పంచుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మారుమూల మండలాల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించాలని కోరారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సర్పంచులకు శుభవార్త చెబుతామని మంత్రులు హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు.



## పాలకుర్తిలో ఘనంగా నూతన వ్యాపారాల ప్రారంభం



**సెప్టెంబర్ 6 జనం వాయిస్ పాలకుర్తి:** పాలకుర్తి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మణికంఠ ఆటోమొబైల్స్ ఢ సర్వీస్, టీ టాక్ ఢ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ హాజరై నూతన వ్యాపార సంస్థలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాలకుర్తి అభివృద్ధిలో వ్యాపార రంగం కీలక పాత్ర పోషిస్తుందని, యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని అన్నారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన ఆటోమొబైల్ సర్వీసులు, టీ, ఫాస్ట్ ఫుడ్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారాలు విజయవంతంగా కొనసాగుతూ మరింత అభివృద్ధి సాధించాలని, భవిష్యత్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుడి కుంట తండా సర్పంచ్ జిల్లా యువజన నాయకుడు బానోత్ మహేందర్ నాయక్, పాలకుర్తి ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్, వార్డు సభ్యులు మామిండ్ల కవితా శోభన్ బాబు, సలేంద్ర రామ సోమన్న, కమ్మ గాని సుధాకర్ గౌడ్, నెమరు గో మ్ముల శ్రీనివాసరావు, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, ఎలుమ కంటి స్వప్న సతీష్ స్థానిక యువత, వ్యాపార ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సంస్థల నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సర్టిఫికెట్ల పరిశీలన!

### మరిపెడ ప్రాజెక్టు సిడిపిఓ ఎం.ఎల్లమ్మ.

**మరిపెడ,సెప్టెంబర్ 06(జనం వాయిస్).**
మరిపెడ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు 7వ,తారీకు నుండి 12వ,తారీకు వరకు సర్టిఫికెట్ల పరిశీలన సంబంధిత మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ (హౌసింగ్ బోర్డు) కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మరిపెడ ప్రాజెక్టు సిడిపిఓ ఎం.ఎల్లమ్మ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం! దంతాలపల్లి మండల పరిధిలోని బొడ్లాడా బీసీ 1 ఎస్ సి 2 వారు 7వ,తారీఖున,మరిపెడ మండలంలోని బాల్య ధర్మారం.2,మాన్సింగ్ తండా,గాలి వారి గూడెం,జామ్లాతండా వారు 8 తారీఖున,మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం -3 నాలుగో వార్డు వారు 9 వ తారీఖున,నెల్లికుదురు మండలం పిర్య తండా,మంచ తండా,వారు 10వ తారీఖున,మరిపెడ మండలం తాళ్లవుకల్ గ్రామ పరిధిలోని చాపలతండ,11 తరగతి వా తారీఖున,నర్సుల పేట మండలం కౌసల్య దేవిపెల్లి గ్రామ పరిధిలోని బీల్యాతండా,వారు 11 వ,తారీకున,నరసింహుల పేట మండలం పరిధిలోని ముదావత్ తండా,పాండ్యా తండా వారు 12వ తారీకున ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు,మూడు జిరాక్స్ సేట్లను గెజిటెడ్ సంతకాలతో సకాలంలో హాజరై సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించు కోవాలని కోరారు.సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు రాని అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించబడునని తెలిపారు.

## రాయపోల్ లో ఘనంగా ఉట్ల పండుగ



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 6,(జనం వాయిస్ ):**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ఎదుట దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి డి.ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం, ఉప సర్పంచ్ గోదాల శేఖర్ రెడ్డి, కౌలు రైతు గోదాల శ్రీనివాస్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఉట్లు కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

## పద్మశాలి యువత రాజకీయాలలో రాణించాలి

### పద్మశాలి కమ్యూనిటీ నీ పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం.
### పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి.

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 6:**
పద్మశాలి యువత రాజకీయాలలో రాణించాలని పెద్దపల్లి పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మేర్గు యాదగిరి, ప్రధాన కార్యదర్శి బోట్ల సాగర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల రామ్మూర్తి ఆదేశాల మేరకు ఆదివారం పెద్దపల్లి పట్టణ పద్మశాలి సంఘం కమ్యూనిటీ స్థలంలో సమావేశమూ ఏర్పాటు చేయగా జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక సత్తయ్య, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిప్ప భాస్కర్, స్వతంత్ర కుమార్, వడ్డేపల్లి నరేందర్ సమక్షంలో పెద్దపల్లి పట్టణ యువజన కమిటీ సమావేశం నిర్వహించి పెద్దపల్లి పట్టణ నూతన కార్యవర్గాన్ని జిల్లా యువజన సంఘం ఆధ్వర్యంలో యువత అందరూ కలిసి ముక్తకంఠంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దపల్లి పట్టణ యువజన సంఘం అధ్యక్షుడిగా పులి రాజు, ప్రధాన కార్యదర్శిగా మోర హరేందర్, ఉపాధ్యక్షులుగా ఆల్లె శివకుమార్, గుండేటి గణేష్, చిప్ప నరసయ్య, మెరుగు నరేష్ , బంక రాజేష్, కోశాధికారిగా గుండేటి అరుణ్, కార్యదర్శిగా గాదాసు మధుకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వేముల సందీప్, అడిచర్ల ఆంజనేయులు, మిట్టపల్లి అభిషేక్, కార్య వర్గ సభ్యులనులను యువత అందరు కలిసి ఏకాథాటిపై ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ గత పదేళ్లు పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం మూడేళ్లు అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలి కమ్యూనిటీని పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పెద్దపల్లి పద్మశాలి కమ్యూనిటీ కి ఇంతవరకు స్థలాన్ని కేటాయించలేదని పేర్కొన్నారు. ఎన్నికలలో హామీలు ఇచ్చి అనంతరం హామీలను తుంగలో తొక్కడవే తప్ప ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడిచిన నియోజకవర్గంలో పద్మశాలి కమ్యూనిటీకి చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పద్మశాలీల అభ్యున్నతికి అభివృద్ధికి పాటుపడే నాయకులకు మద్దతు తెలుపుతామన్నారు. ప్రభుత్వం 52 సంవత్సరాలు నిండిన ప్రతి పద్మశాలి వ్యక్తికి ఏలాంటి నిబంధనలు లేకుండా చేనేత పింఛన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్నుకోబడిన నూతన కమిటీని యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం, యువజన సంఘం, పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



## నంది వనపర్తిలో అంగరంగ వైభవంగా

# పోచమ్మ తల్లి బోనాలు

.భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన మహిళలు.
.డప్పు, డోలు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగింపు.
.మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, అలంకారణంగా నిలిచారు.





**యాచారం, సెప్టెంబర్ 6 (జనం వాయిస్):**
యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనమెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలను సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని గ్రామ వీధుల్లో భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. డప్పు కళాకారులు, డోలు వాయిద్యాల నడుమ సాగిన బోనాల ఊరేగింపు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది. వాయిద్యాల మోతకు అనుగుణంగా శివసత్తులు పూనకాలతో నృత్యాలు చేయగా, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అమ్మవారి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పోచమ్మ తల్లి తమ కుటుంబాలను చల్లగా చూడాలని, గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని భక్తులు మొక్కుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరిన సందర్భంగా పలువురు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని వీధులు భక్తులతో కిక్కిరిశాయి. చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో నంది వనపర్తి అంతా పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ్ కుమార్, వార్డు సభ్యులు, కులస్తులు, బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మరిపెడలో వినాయక ఉత్సవాలపై పోలీసుల కీలక ఆదేశాలు.

అనుమతి లేని మండపాలకు పర్మిషన్ అనుమతించబడదు.
మట్టి గణపతులనే పెట్టండి.చెరువులను కాపాడండి.
రాత్రి 10 తర్వాత డీజేలకు బ్రేక్,నిబంధనలు అతిక్రమిస్తే కేసులే.
మరిపెడ పోలీసు ఎస్ ఐ గండ్రాతి సత్తిష్.





**మరిపెడ,సెప్టెంబర్ 06(జనం వాయిస్).**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల ప్రజలందరికీ మరిపెడ ఎస్ఐ గండ్రాతి సతీష్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియచేశారు.శనివారం మరిపెడ పోలీస్ స్టేషన్ లో మండల వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వినాయక ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


**పాటించాల్సిన నియమ నిబంధనలు:**
మండపాల అనుమతులు: ప్రతి గ్రామంలో,ప్రతి కాలనీలో వినాయక మండపం ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ముందుగా మరిపెడ పోలీస్ స్టేషన్ కు వచ్చి అనుమతి పత్రం తీసుకోవాలి.అనుమతి లేని మండపాలను అనుమతించబోము.రోడ్లపై ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలి.
విద్యుత్ మరియు భద్రత: మండపాల దగ్గర విద్యుత్ వైర్లు వేలాడకుండా జాగ్రత్త వహించాలి.చిన్న పిల్లలు వైర్లను ముట్టుకోకుండా చూడాలి.ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా ఇసుక/నీటితో కూడిన అగ్నిమాపక బకెట్ ఉంచాలి.వీలైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
శబ్ద కాలుష్యం: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత డీజేలు,లౌడ్ స్పీకర్లు కట్టివేయాలి.అధిక శబ్దంతో వృద్ధులు,చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగించరాదు.నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం.
శాంతి భద్రతలు: ఉత్సవాల పేరుతో మద్యం సేవించి గొడవలు పడితే,రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.మహిళలు,చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా,దొంగతనాలు చేసినా ఉపేక్షించేది లేదు.
పర్యావరణ పరిరక్షణ:దయచేసి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలను వాడవద్దు.మన చెరువులను కాపాడేందుకు మట్టి గణపతులనే ప్రతిష్ఠించండి.కెమికల్స్ లేని రంగులు వాడండి.
నిమజ్జనం రోజు నియమాలు: నిమజ్జన ఊరేగింపులో వాహనాలపైకి ఎక్కి డ్యాన్స్ చేయడం,ట్రాక్టర్లు,డీసీఎంలపై ప్రమాదకరంగా కూర్చోవడం చేయవద్దు.పోలీసులు కేటాయించిన రూట్ లోనే వెళ్లాలి.చెరువుల వద్ద లోతు ప్రదేశాల్లోకి వెళ్లవద్దు.ఈత రాని వారు నీళ్లలోకి దిగవద్దు.నిమజ్జనం రోజున మద్యం సేవించి వాహనాలు నడపరాదు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా,ఏదైనా గొడవ జరిగినా వెంటనే డయల్ 100 కు లేదా మరిపెడ ఎస్ఐ సతీష్ కి,పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.ఇట్లు,ఎస్.ఐ.గండ్రాతి సతీష్,మరిపెడ పోలీస్ స్టేషన్.

## మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ చేతుల మీదుగా హైదరాబాదులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి



**జనం వాయిస్, ఖమ్మం, సెప్టెంబర్ 06**
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. తెలంగాణ టీచర్స్ ఢ లెక్చరర్స్ ఫోరం వారు ఈ అవార్డును దివ్యమూర్తికి టీచర్స్ డే సందర్భంగా హైదరాబాదులో ని బాగ్లింగంపల్లి గల సుందర విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్లో అందజేయడం జరిగింది.ఈ అవార్డును దివ్యమూర్తి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. తదనంతరం దివ్యమూర్తిని ఈటెల రాజేందర్ మరియు ఇతర ప్రముఖులు శాలువాతో సన్మానించడం చేయడం జరిగింది. దివ్యమూర్తి ఎన్నో చోట్ల తన స్పీచ్ లతో విద్యార్థులను చైతన్యం చేస్తున్న విధానాన్ని బట్టి ఈ అవార్డు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ టీచర్స్ ఢ లెక్చరర్స్ ఫోరం వారు తెలియజేశారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం మరియు సన్మానం జరగడం సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 80 అవార్డులు వచ్చాయని 144 వేదికల మీద సన్మానాలు జరిగాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారామ్ నాయక్, మాసం రత్నాకర్ పటేల్, దుర్గా భవాని, తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు, తదితరులు పాల్గొన్నారు.






## నాగేపల్లి మెయిన్ రోడ్డు నుండి స్వర్ణపల్లి, వెంకటాపూర్ రోడ్డుకు రూ.11. 72 కోట్లు మంజూరు పట్ల హర్షం





**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 6:**
మంథని మండలంలోని నాగేపల్లి మెయిన్ రోడ్డు నుండి స్వర్ణవల్లి, వెంకటాపూర్ వరకు గల రోడ్డు నిర్మాణానికి సింగరేణి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) నిధుల నుండి రూ. 11 కోట్ల 72 లక్షల నిధులు మంత్రివర్యులు శ్రీధర్ బాబు చొరవతో మంజూరు కావడం పట్ల గ్రామస్తులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్థుల కోరిక మేరకు ఈ రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలు పాటు ప్రతి ఇంటికి త్రాగునీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నాగేపల్లి మెయిన్ రోడ్డు వద్ద మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుమ్మడి సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మంథని సత్యం, మాజీ మండల యూత్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ , మాజీ ఎంపీటీసీ బానయ్య, మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి , కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, కొండ మహేందర్, మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, పర్శవేన మోహన్ యాదవ్, బెజ్జంకి మల్లయ్య బొమ్మ సత్తిరెడ్డి, రమేష్ కాపురపు రమేష్, కొప్పుల చంద్రయ్య, అక్కపాక సదయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు